క్లుప్తంగా

నేడు నాలా పనుల పర్యవేక్షణ

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం రోడ్డులో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ నాలా నిర్మాణ పనులను ఆదివారం ఉదయం 10:30 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యవేక్షిస్తారని బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

20న ఆంధ్ర బాలానంద సంఘం వార్షికోత్సవం

కాచిగూడ: బాలానందం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న రవీంద్రభారతిలో ఆంధ్ర బాలానంద సంఘం 83వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ చిత్తరంజన్, కార్యదర్శి జేవీ కామేశ్వరి తెలిపారు. బాలానందం బాలలచే సాంస్కృతిక ప్రదర్శన, వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వారు పేర్కొన్నారు. వేడుకలకు ప్రముఖ కవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి, లలిత సంగీత దర్శకులు పవీ సాయిబాబా, మిమిక్రీ శ్రీనివాస్, మృత్యుంజయ శర్మ పాల్గొంటారని తెలిపారు.

ప్రత్యేక పూజలు



శనీశ్వరుడికి తైలాభిషేకం చేసి హారతి ఇస్తున్న అర్చక స్వామి

నల్లకుంట: శని త్రయోదశిని పురస్కరించుకొని శనివారం న్యూ నల్లకుంటలోని కొత్త రామాలయంలో గల నవగ్రహ మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అర్చక స్వామి మంత్రోచ్చారణల నడుమ భక్తులు శనీశ్వరుడికి తైలాభిషేకాలు చేశారు. అనంతరం నవగ్రహ పూజలు చేశారు. దాదాపు 114 ఏళ్ల తర్వాత మహా శివరాత్రి, శని త్రయోదశి ఒకేరోజు రావడంతో భక్తులు పెద్ద ఎత్తున పూజలో పాల్గొన్నారు.

నేటి నుంచి టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 (నేటి)నుంచి మార్చి 1వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణ, 24న గరుడ వాహనసేవ, 27న రథోత్సవం, 28న చక్రస్నానం, మార్చి 1న పుష్పయాగం తదితర పూజలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతిరోజూ స్వామివారి విశేష వాహన పూజలు ఉంటాయన్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న హోంగార్డు మృతి



దీపక్‌సింగ్ (ఫైల్)

బంజారాహిల్స్: బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ హోంగార్డు దీపక్ సింగ్ శనివారం మృతి చెందారు. ఈనెల 7న దీపక్ సింగ్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. సిబ్బంది అతడ్ని వెంటనే జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అతని చికిత్స కోసం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కలిసి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. కాగా పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపక్ సింగ్‌ను శుక్రవారం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా, దీపక్ సింగ్ బ్లూకోల్ట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. దాదాపు పదేళ్లకుపైగా ఫిలింనగర్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఇతను ఆ ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు. దీపక్ సింగ్ విషయాన్ని గుర్తించిన అపోలో ఆసుపత్రి యాజమాన్యం అతడి చికిత్సకు అయిన రూ.14 లక్షలను మాఫీ చేసింది. దీంతో అపోలో యాజమాన్యానికి పోలీసు అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

20న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉప్పల్: హబ్సిగూడ డివిజన్ పరిధిలో అధికారులు చొరవ తీసుకుని విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని డీఈ సాయిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఈ కార్యాలయం ఆవరణలో 20 తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. బిల్లుల్లో హెచ్చుతగ్గులు, లో ఓల్టేజ్ సమస్యలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



హరహర మహాదేవ

కనుల పండువగా మహా శివరాత్రి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- ఉదయం నుంచే ప్రత్యేక పూజలు

అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శనివారం మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమశివాయ.. అంటూ భక్తుల శివనామ స్మరణలతో ఆలయాలు హోరెత్తాయి. తెల్లవారు ఝామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం శివాలయాలలో లింగోద్భావం, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేశారు. – అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ల బృందం



మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



న్యూరామాలయంలో రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు



భోలక్‌పూర్ భవానీ శంకర ఆలయంలో... ఎమ్మెల్యే ముఠా గోపాల్



వీరన్నగుట్ట శివాలయంలో... జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు



బొమ్మల గుడిలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, కల్పన యాదవ్



అశోక్‌నగర్‌లో రుద్రాక్ష శివలింగాన్ని దర్శించుకున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చిక్కడపల్లి: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ.. మెరుగైన వసతులు కల్పించి గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జవహర్‌నగర్‌లో బీజేపీ నేతలు ఎం.శ్రీనివాస్‌రావు, హర్షయాదవ్, శివకుమార్, ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. ఉల్లిగడ్డ బస్తీలో ప్రెషర్ నీటి సరఫరాను పరిష్కరించామన్నారు. డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నియోజవర్గ కన్వీనర్ రమేష్‌రామ్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు శ్రీకాంత్, మహమూద్, ఆకుల సురేందర్, సురేష్, సాయికుమార్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ఉప్పల్: లక్ష్మీనారాయణ కాలనీలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన కల్యాణ మండపాన్ని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభినట్లు నిర్వాహకులు తెలిపారు. కాలనీ అధ్యక్షులు లుకాస్, వాసిరెడ్డి శ్రీధర్ ప్రసాద్, నాగేశ్వర్‌రావు, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మీర్‌పేట: విద్యార్థులు ఇష్టపడి చదవాలని భాష్యం పాఠశాల జెడ్‌ఈఓ అంకమ్మరావు సూచించారు. మీర్‌పేటలోని భాష్యం పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు స్రవంతి,లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ శృతి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

శంకర్‌యాదవ్‌ను సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



శంకర్‌యాదవ్‌ను సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్: బీజేపీ జీహెచ్‌ఎంసీ పక్ష నేతగా ఎంపికైనా బేగంబజార్ కార్పొరేట్ గొంటి శంకర్‌యాదవ్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శాలువా, పూలమాలతో సన్మానించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌ను బీజేపీ కార్యకర్తలతో కలిసి శనివారం కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి శంకర్‌యాదవ్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ప్రజా సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌యాదవ్, రాజు మహరాజ్, కట్ట రమేష్ ముదిరాజ్, మహేందర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత చైతన్య స్ఫూర్తి భాగ్యరెడ్డి వర్మ: జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: దళితుల్లో చైతన్యానికి విద్యను ఆయుధంగా మలచిన దళిత చైతన్య స్ఫూర్తి భాగ్యరెడ్డి వర్మ అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శనివారం రవీంద్ర భారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, భాగ్యరెడ్డి వర్మల స్ఫూర్తితో సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలు నెలకొల్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్. ఉపేందర్, ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

భాగ్యరెడ్డి వర్మ సమాజానికి స్ఫూర్తిదాయకం

సుల్తాన్‌బజార్: భాగ్యరెడ్డి వర్మ సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి అన్నారు. ఆదియందు సోషల్ లీక్స్ ఆధ్వర్యంలో శనివారం చాదర్‌ఘట్‌లోని ఆది హిందూ భవన్‌లో భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి నిర్వహించారు. సెంటర్ ఫర్ మహాయాన బుద్ధిష్ట్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ లీగ్ అధ్యక్షుడు రాహుల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పండరినాథ్, మేనేజింగ్ ట్రస్టీ జ్ఞాన ప్రకాష్, నరసింహ సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి అఖండ జ్యోతియాత్రకు ఘన స్వాగతం

చిక్కడపల్లి: శ్రీలక్ష్మీనరసింహ స్వామి 29వ అఖండ జ్యోతి యాత్రకు ఘనస్వాగతం పలికారు. మాజీ కార్పొరేటర్ టి.శైలజ గోపాల్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని సుధా హోటల్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సతీమణి కె.ఉమాలక్ష్మణ్ ప్రత్యేక పూజలు చేశారు. అఖండ జ్యోతి యాదగిరిగుట్ట వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.గోపాల్, బీజేపీ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ జయేందర్ బాబు, వనజ, పద్మజ, ఉమా, విశిష్ట, వసంత, రాధా, జయేందర్‌బాబు, నర్సింగ్‌రావు, వాణీశ్వర శాస్త్రి, శంకర్‌గౌడ్, సురేష్‌రాజు, శ్రీను, ఆకుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి మధ్య తరగతి విద్యార్థులను ఆదుకోవాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటిక్యాల గణేశ్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన సమాఖ్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, 2019 నుంచి 2022 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

కరపత్రం సాహిత్యంపై పరిశోధనకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: కరపత్రం సాహిత్యంపై తొలిసారి పరిశోధన చేసిన వేల్పుకొండ వెంకటేక్‌కు ఓయూ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.సూర్యధనుంజయ్ పర్యవేక్షణలో కరపత్రం సాహిత్య ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ నాయకునిగా పనిచేసిన వెంకటేష్ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

కొనసాగుతున్న నవ చండీ యాగం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లోని రేణుక రాజేశ్వరి పీఠం జగన్మాత ఆలయంలో మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్ర సహిత నవ చండీ యాగం రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. యాగంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్తనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రదీప్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమానికి ప్రజాదరణ లభిస్తోందని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని బాదం గల్లీ, గగన్‌పహాడ్, బరఫ్‌గల్లీలో ప్రారంభమైన హాత్‌సే హాత్ జోడో యాత్రకు అనిల్ కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరాముల యాదగిరి, ముషీరాబాద్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వి.డి.కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ధర్మేందర్, స్థానిక నేతలు సాయిబాబా, రమేష్, దశరథ్, పి.లక్ష్మణ్, బాబురావు, గుర్రం శంకర్, పవన్, వెంకట్‌రెడ్డి, రాజు, రుషికేశ్వర్‌రావు, మేడి సురేష్, విజయ్, బబ్లూ పాల్గొన్నారు.



దోమలగూడ బాదం గల్లీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న స్నితప్రజ్ఞ, డాక్టర్ ముజీబ్ హుస్సేని

అబిడ్స్: మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్ నిర్మూలన సంస్థ అధ్యక్షుడు స్నితాప్రజ్ఞ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 700 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్నితప్రజ్ఞ వారి సర్టిఫికెట్లు ప్రదానం చేసి ప్రసంగించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన అన్నారు. డాక్టర్ ముజీబ్ హుస్సేని మానవతా దృక్పథంతో ఒక సామాజిక కార్యక్రమం చేపట్టడం ఎంతో గొప్పదని అభినందించారు.

ఘనంగా బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం

నాగోలు: విద్యార్థులకు చదువుతోపాటు అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని బచ్‌పన్ స్కూల్స్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల రీజనల్, అకడమిక్ డైరెక్టరు శ్రీకాంత్‌రెడ్డి, రూపారెడ్డి అన్నారు. కొత్తపేట బచ్‌పన్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల వార్షికోత్సవం కొత్తపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను బయటకు రాబట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకుట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవి, పంకజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



వేడుకలను ప్రారంభిస్తున్న డీఐజీ రమేష్‌రెడ్డి

కాచిగూడ: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఐజీ ఎం.రమేష్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి రాణి స్కూల్, బూర్గుల రామకృష్ణారావు బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించగలుగుతారన్నారు. విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విద్య అవసరమని, ఆ దిశగా చదవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా 75 ఏళ్లలో దేశాన్ని పాలించిన ప్రధానుల పరిపాలన విశేషాలతో కూడిన నృత్యరూపకం, స్వాతంత్ర సంగ్రామంలో చేసిన పోరాట సమరయోధుల ఇతివృత్తంతో కూడిన నాటకాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు శేషు విఠల్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ మంజులదేవి, హెడ్ మిస్ట్రెస్ ఉదయలక్ష్మి, శ్రీవాణి, గాలి గాయత్రి పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం దోమలగూడలో బీజేపీ కార్నర్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ టి.రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముషీరాబాద్‌లో బీజేపీ విజయం సాధించడం తథ్యమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు, రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు మహేందర్‌బాబు, కార్యదర్శి ప్రభాకర్‌గంగపుత్ర, సురేష్‌ముదిరాజ్, ముషీరాబాద్ ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురామ్, శంకర్‌లాల్, పాండు, బాబు, రంజిత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్

అప్పుల ఊబిలో తెలంగాణ: బీజేపీ



నాగోలు: నీళ్లు, నిధులు, నియామకాల సాధనే లక్ష్యం ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కల్వకుంట్ల కుటుంబ రాజ్యాంగం అమలవుతోందని, మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా సీఎం కేసీఆర్ మార్చారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆరోపించారు. కొత్తపేట డివిజన్‌లో బీజేపీ నాయకులు యప్పాలగౌడ్, ఉపేందర్ సింగ్, సాయినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిచిన కార్నర్ మీటింగ్–ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామ రంగారెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు దళిత 'బంధు రాలే, మూడు ఎకరాల భూమి రాలే, వృద్ధులకు పింఛన్ రాలే, రేషన్ కార్డులు రాలే' అని వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ని డల్లాస్‌లా మారుస్తానన్న సీఎం కేసీఆర్ కనీసం డివిజన్ అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. జీహెచ్‌ఎంసీని సైతం అప్పుల ఊబిలోకి తోసేశారని వాపోయారు.

దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ: నందకిశోర్

అబిడ్స్: సీఎం కేసీఆర్‌కు తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గంగపుత్రా సమాజ్, జనతా జనార్దన్ సమితికి చెందిన దాదాపు 300 మంది శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నందకిశోర్ వ్యాస్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్నివర్గాల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, పరమేశ్వరీ సింగ్, సంతోష్‌గుప్తా, ఆలపురుషోత్తమ్, ఆనంద్‌సింగ్, అనిత, శంకర్‌సింగ్ జమేదార్, పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, శ్రీనుగౌడ్, ప్రదీప్‌రాజ్, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్